
సాక్షి
అనంతపురం
శనివారం | 25 | మే | 2024



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



ఎస్కేయూలో కొత్త టెక్ కోర్సులు

ఎస్కేయూలోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్, ఎంటెక్‌లో కొత్తగా పలు కోర్సులు ప్రవేశపెట్టారు. 8లో

గరిష్టం/కనిష్టం
$40.5^{\circ}/25.3^{\circ}$

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు వీచాయి.

న్యూస్‌రీల్

డీఈఓ స్క్రీనింగ్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో శనివారం జరగనున్న డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఈఓ) పోస్టులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణపై డీఆర్‌ఓ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షకు 1,735 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

గంటన్నర ముందే చేరుకోవాలి

నిర్దేశించిన పరీక్ష సమయం కంటే అభ్యర్థులు గంటన్నర ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఆర్‌ఓ సూచించారు. అభ్యర్థులను ఉదయం 7.30 గంటల నుంచి ఉదయం 8.15 గంటల వరకు కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. ఆపై ఆలస్యంగా వచ్చిన వారిని గ్రేస్ పీరియడ్‌లో ఉదయం 8.30 గంటల వరకు అనుమతిస్తారన్నారు. గ్రేస్ పీరియడ్ తరువాత వచ్చే అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించబోరని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదేని గుర్తింపు కార్డు (ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, తదితర కార్డులు) వెంట తెచ్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించబోరన్నారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అధికారులు ప్రతాప్‌కుమార్, శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీఈఈసెట్‌కు 43 మంది గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఈఈసెట్–2024కు 43 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అనంతపురం శివారులోని చిన్మయనగర్ ఎల్‌ఆర్‌జీ స్కూల్ పక్కన నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సోషియల్ యాక్షన్ ఇండియా (ఎన్‌సీపీఎస్‌ఏఐ) పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు జరిగిన పరీక్షకు 343 మంది అభ్యర్థులకు గాను 300 మంది హాజరయ్యారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ కేంద్రాన్ని పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు.

బుద్ధం శరణం గచ్ఛామి



జయమంగళగాత్‌ను పఠిస్తున్న బౌద్ధ సన్యాసులు

ప్రశాంతి నిలయం: బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని రెండురోజులుగా ప్రశాంతి నిలయంలో నిర్వహిస్తున్న వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత నేపాల్‌కు చెందిన బౌద్ధ సన్యాసులు తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ 'జయమంగళగాత్' నిర్వహించారు.

అంతటా ఉత్కంఠ

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ (ఓట్ల లెక్కింపు) తేదీ దగ్గరపడేకొద్దీ అభ్యర్థుల్లో నరాలు తెగే ఉత్కంఠ మొదలైంది. జిల్లాలో ఎక్కువ సీట్లు సాధించే పార్టీ ఏది.. అత్యధిక మెజార్టీ సొంతం చేసుకునే అభ్యర్థి ఎవరు.. ఎన్ని సీట్లతో ఏ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది? ఇలా ఏ నియోజకవర్గంలో చూసినా విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి.

- 4న కౌంటింగ్ ప్రక్రియ
- తొలి ఫలితం ఉరవకొండ
- చివరిది రాయదుర్గం నియోజకవర్గం
- ఉదయం 8 గంటలకే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం
- ఏజెంట్ల నియామకంపై దృష్టి సారించిన రాజకీయ పార్టీలు



ఓట్ల లెక్కింపు కేంద్రం

రాయదుర్గం: జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు పది రోజులు మాత్రమే సమయం ఉంది. జూన్ 4న జరిగే కౌంటింగ్‌కు తగిన ఏర్పాట్లు చేసుకోవడంలో రాజకీయ పార్టీలు తలమునకలయ్యాయి. ముఖ్యంగా ఏజెంట్ల నియామకం, రిలీవర్స్, రాత్రికి బస చేసేందుకు వసతి, ఇతర అవసరాలపై నాయకులు దృష్టి సారించారు.

తొలి ఫలితం ఉరవకొండ..

కౌంటింగ్‌లో తొలిగా ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఫలితం వెలువడే అవకాశం ఉంది. ఈ నియోజకవర్గంలోని 263 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,24,339 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,92,441 మంది (85.78 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. లెక్కింపు ప్రక్రియలో అత్యధికంగా 18 టేబుళ్లు, 15 రౌండ్లలో ఫలితం తేలనుంది.

చివరి ఫలితం రాయదుర్గం

జిల్లాలో చిట్టచివరగా రాయదుర్గం నియోజకవర్గ ఫలితం వెలువడనుంది. అత్యధికంగా 296 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,64,352 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ 85.96 శాతంతో 2,27,248 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 14 టేబుళ్లలో 22 రౌండ్లు లెక్కించనున్నారు. ఈ ఫలితం ఆలస్యంగా తేలనుంది.

అసెంబ్లీకి 14.. పార్లమెంట్‌కు 14 టేబుళ్లు

జిల్లాలో అసెంబ్లీ స్థానాలకు 14, పార్లమెంట్ స్థానాలకు 14 టేబుళ్లు ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఉరవకొండ సెగ్మెంట్‌కు 15 రౌండ్లు, కళ్యాణదుర్గం 19, తాడిపత్రి, గుంతకల్లు 20, రాప్తాడు, అనంతపురం అర్బన్, శింగనమల 21, రాయదుర్గం 22 రౌండ్లకు లెక్కింపు పూర్తికానుంది.

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	లెక్కించే రౌండ్లు
రాయదుర్గం	296	2,64,352	2,27,248	22
ఉరవకొండ	263	2,24,339	1,92,441	15
గుంతకల్లు	276	2,70,648	2,03,820	20
తాడిపత్రి	274	2,48,880	2,06,703	20
శింగనమల	293	2,47,373	2,05,068	21
అనంతపురం	292	2,81,214	1,83,018	21
కళ్యాణదుర్గం	261	2,30,785	2,05,143	19
రాప్తాడు	281	2,50,571	2,13,207	21

మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. 4వ తేదీ ఉదయం 8 గంటలకే ప్రారంభమవుతుంది. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 22,546 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పార్లమెంట్ స్థానానికి 20 టేబుళ్లు, అసెంబ్లీకి 34 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో తాడిపత్రికి ఆరు.. మిగిలిన అన్ని నియోజకవర్గాలకూ 4 చొప్పున టేబుళ్లు ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఏజెంట్ల నియామకంపై దృష్టి

ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ మొదలవడంతో రాజకీయ పార్టీల నాయకులు ఏజెంట్ల నియామకంపై దృష్టి సారించారు. పది రోజుల ముందే జిల్లా వ్యాప్తంగా ఈ హడావుడి కనిపిస్తుండడం విశేషం. గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల బెట్టింగులు జరుగుతున్నాయి. కలెక్టర్, ఎస్పీ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహిస్తూ సమస్యాత్మక గ్రామాల్లో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. హింసకూ తావివ్వకుండా పటిష్ట చర్యలకు శ్రీకారం చుట్టారు.

కౌంటింగ్ ప్రశాంతంగా సాగాలి

- అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సహకరించాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ గౌతమి శాలి

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న చేపట్టే ఓట్ల లెక్కింపునకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ తెలిపారు. కౌంటింగ్ నిర్వహణ, ఏర్పాట్లపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఎస్పీ గౌతమి శాలితో కలిసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకూ అభ్యర్థులు, రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఎన్నికల ఫలితాలను స్పోర్టివ్‌గా తీసుకోవాలని సూచించారు.

అమలులో 144 సెక్షన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా 133 సెక్షన్ కింద ఇతరులకు హాని కలిగించే ఆయుధాలు, రాళ్లు, కర్రలు, తదితర వస్తువులు కలిగి ఉండకూడదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే జూన్ 6వ తేదీ వరకు బాణసంచా అమ్మకాలు, కొనుగోలు, రవాణా, వినియోగంపై నిషేధం విధించామన్నారు. దీన్ని ఎవరూ ఉల్లంఘించకూడదన్నారు.

హింసకు తావివ్వరాదు

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎక్కడా హింసకూ తావివ్వరాదని ఎస్పీ గౌతమి శాలి అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. హింస సృష్టించినా, సృష్టించాలని చూసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన బందోస్తు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎనిమిది మందిని జిల్లా నుంచి బహిష్కరణ చేశామన్నారు. గొడవలు చేస్తారని గుర్తించిన వారిని బైండోవర్ చేస్తున్నామన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు 1,354 మంది సిబ్బంది

ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) ప్రక్రియ నిర్వహించేందుకు 1,354 మంది సిబ్బందిని నియమించామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్ ఎన్‌ఐసీలో కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి ఒకటవ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ నిర్వహించారు. ఈసీ ఆదేశాల మేరకు సీపీఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ ద్వారా పారదర్శకతతో కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ చేపట్టామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎన్‌ఐసీ డీఐఓ రవిశంకర్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో పలు చోట్ల వర్షాలు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. కణేకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, గుమ్మఘట్ట, ఉరవకొండ మండలాల్లో 40 – 50 మి.మీ వర్షపాతం నమోదైంది. శెట్టూరు, బొమ్మనహాళ్, యాడికిలో 20 నుంచి 30 మి.మీ, అనంతపురం, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు, రాయదుర్గం, బ్రహ్మసముద్రం, ఆత్మకూరు, పుట్లూరు, పెద్దవడుగూరు, కంబదూరు తదితర మండలాల్లో మోస్తరుగా వర్షం కురిసింది.

నేడు ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

తుపాను ప్రభావం ఒడిశా, పశ్చిమబెంగాల్‌కు మళ్లిపోవడంతో రాగల ఐదు రోజులు పొడి వాతావరణం ఉంటుందని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త జి.నారాయణస్వామి తెలిపారు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదు కావచ్చన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



అనంతపురంలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ జేసీ మేఘ స్వరూప్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్ నగరంలోని కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలించారు. ట్రైనీ కలెక్టర్ బి.వినూత్న టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాల పంపిణీని పర్యవేక్షించారు. తర్వాత కేఎస్‌ఆర్ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఎస్‌బీఎన్ జూనియర్ కళాశాల, శ్రీ సత్యసాయి బాలికల జూనియర్ కళాశాల కేంద్రాలను వినూత్న పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షకు 183 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 3,517 మందికి గాను 3,346 మంది హాజరయ్యారు. 171 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 207 మందికి గాను 195 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు జనరల్ విద్యార్థులు 507 మందికి గాను 479 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 89 మందికి గాను 85 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.వెంకటరమణనాయక్ 5 కేంద్రాలు, డీఈసీ సభ్యులు నాలుగు, ఫ్లయింగ్‌స్క్వాడ్ సభ్యులు ఆరు కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలోని 45 కేంద్రాల్లో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్షకు 5,423 మంది విద్యార్థులకు గాను 2,576 మంది హాజరయ్యారు. 2,847 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ వరలక్ష్మి గుంతకల్లులో రెండు కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద్‌నాయక్ అనంతపురంలో మూడు కేంద్రాలు పరిశీలించారు.

నిబంధనలు తప్పనిసరి

- ఓట్ల లెక్కింపుపై మార్గదర్శకాలు జారీ చేసిన ఎన్నికల సంఘం

అనంతపురం అర్బన్: సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు అంశంపై ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, ఎన్నికల డీటీలు, కౌంటింగ్ సిబ్బంది విధులకు సంబంధించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు నిర్దేశించింది. ముఖ్యంగా స్ట్రాంగ్ రూమ్ లే అవుట్‌పై ఇన్‌చార్జ్ అధికారి అవగాహన కలిగి ఉండాలి. నోడల్ అధికారులు వారికి అప్పగించిన పనులు సక్రమంగా నిర్వర్తించాలి. సందేహాలు వచ్చినప్పుడు ఆర్‌ఓలతో మాట్లాడాలి. అంతే తప్ప సొంత నిర్ణయాలు తీసుకుంటే చర్యలకు గురవుతారు. పోస్టల్ బ్యాలెట్, స్ట్రాంగ్ రూమ్ నోడల్ అధికారులు, సీలింగ్ అధికారులు, రో–ఇన్‌చార్జ్‌లు అనుసరించాల్సిన విధి విధానాలను ప్రత్యేకంగా సూచించింది. పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్లు ఎలా లెక్కించాలి, వ్యాలీడ్, ఇన్‌వ్యాలీడ్ ఓట్లను ఎలా గుర్తించాలి అనేదానిపై సిబ్బందికి త్వరలో శిక్షణ ఇవనున్నారు..

చెక్‌లిస్ట్ ప్రకారం ఏర్పాట్లు చేసుకోవాలి

- ఓట్ల లెక్కింపు రోజున అధికారులు వారికి కేటాయించిన విధులకు సంబంధించి చెక్‌లిస్ట్ ప్రకారం ఏర్పాట్లు చేసుకోవాలి.
- ఏ అంశాలకు, ఏ వస్తువులు ఉండాలి. లెక్కింపు కేంద్రంలో ఏ విధమైన ఏర్పాట్లు చేయాలనే అంశంపై అధికారులు అవగాహన కలిగి ఉండాలి. జూన్ 3వ తేదీ సాయంత్రానికి కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలి.

ఫలితాల ప్రకటనలో అప్రమత్తంగా ఉండాలి

- రౌండ్ల వారీగా ఫలితాలు నమోదు, వాటిని ప్రకటించే క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అంకెల్లో పొరపాటు జరగకూడదు.
- రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు నిర్వహించాలి. అలాగే సహాయ ఆర్‌ఓ ఆధ్వర్యంలో ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన స్థానిక తహసీల్దార్ ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తెరుస్తారు

- ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లు తెరుస్తారు. స్ట్రాంగ్‌రూమ్‌లో ఒక నోడల్ అధికారి ఉంటారు.
- కౌంటింగ్‌కు ఈవీఎంలను ఆయన సిద్ధం చేస్తుంటారు. ఈవీఎంలకు సంబంధించిన ట్యాగ్ సరిగ్గా ఉందా లేదా అనేది పరిశీలిస్తారు.

అవగాహనతో ఉండాలి

- కౌంటింగ్‌లో తలెత్తే సమస్యలను పరిష్కరించుకోవాలంటే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.
- పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్‌లో సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలి. పోస్టల్ బ్యాలెట్ లెక్కించేందుకు ఒక ఏఆర్‌ఓ, కంప్యూటర్ అసిస్టెంట్, కంప్యూటర్ సూపర్‌వైజర్, సూక్ష్మ పరిశీలకుడు ఉంటారు.

ఈసీ పరిశీలకుల నిఘా

- కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులు కౌంటింగ్ ప్రక్రియను, ఫలితాల తయారీ, డిక్లరేషన్‌ను దగ్గరుండి పరిశీలిస్తారు.
- కౌంటింగ్ పూర్తయి తుది ఫలితాలు ప్రకటన చేయగానే గెలుపొందిన అభ్యర్థికి ఫారం 21–ఇని అందజేయాలి.
- ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి. ఫలితాలు ప్రకటన పూర్తయే వరకు కౌంటింగ్ సిబ్బంది కేంద్రాల వద్దనే ఉండాలి.

బ్రహ్మ రథోత్సవాన్ని విజయవంతం చేద్దాం



సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ఉరవకొండ: అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం విజయంతం చేద్దామని తహసీల్దార్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్ కోరారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయలన్నారు. ఆర్టీసీ అధికారులు బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక సర్వీసులు నడపాలన్నారు. అగ్నిమాపకశాఖ తమ అత్యవసర సర్వీసులను అందుబాటులో ఉంచాలని, పెన్నహోబిలం పరిసరాల్లో అక్రమ మద్యం అమ్మకుండా ఎక్సైజ్ శాఖ వారు చర్యలు తీసుకోవాలని కోరారు.

హంస వాహనంపై నారసింహుడు



ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం హంసవాహనోత్సవ సేవ వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు హంస వాహనంపై మాడ వీధుల్లో దర్శనమిచ్చారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హంసను జ్ఞానానికి ప్రతీకగా పేర్కొంటారు. భక్తుల్లో నెలకొన్న అహంభావాన్ని తొలగించి జ్ఞానసిద్ధి, బ్రహ్మపద ప్రాప్తి ప్రసాదించేందుకు స్వామి వారు హంస వాహనంపై కన్పిస్తాడని పండితులు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ విజయ్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీస్వామి పాల్గొన్నారు.

నమో వేంకటేశ..



హనుమద్ వాహనంపై శ్రీవారు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన కలియుగదైవం ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం శ్రీవారు భక్తులకు హనుమద్ వాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. హనుమద్ వాహనోత్సవ సేవలో భాగంగా సుగాలి సంఘం ఆధ్వర్యంలో మేళతాళాలతో సాయంత్రం స్వామి వారిని హనుమద్ వాహనంపై కొలువుదీర్చి ఆలయం వద్ద నుంచి కోట, మొలకాల్మూరు రోడ్డు, వినాయక సర్కిల్, పాతబస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా ఊరేగించి..తిరిగి ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి పెళ్లికి భక్తులంతా అతిథులే

రాయదుర్గం: కోటలోని ప్రసన్న వెంకటరమణుడి ఆలయంలో శనివారం విశిష్ట సంప్రదాయ పద్ధతులతో జరిగే శ్రీవారి కల్యాణోత్సవానికి భక్తులంతా అతిథితులుగా తరలిరానున్నారు. శుక్రవారం వరుడిగా వెంకటేశ్వరుడు, వధువుగా అరవ తెగకు చెందిన 14 ఏళ్ల బాలికను ముస్తాబు చేశారు. శనివారం ఉదయం కన్యాదాత స్వగృహం నుంచి వరుడు ఉండే వేంకటరమణుడి ఆలయం వరకు చేపట్టే ఊరేగింపునకు చేసిన ఏర్పాట్లను ఆలయ ఈఓ నరసింహారెడ్డి పరిశీలించారు. 11:30 గంటలకు జీలకర్ర, బెల్లం పెట్టి సంప్రదాయ పద్ధతి ప్రకారం కల్యాణం జరిపించనున్నారు.



విద్యుత్ అలంకరణలో ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయం

సాగులో సలహాలు తీసుకోవాలి



విత్తన వేరుశనగను రైతులకు అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుమ్మఘట్ట: రైతులు సాగు సమయంలో అధికారుల సలహాలు, సూచనలను పరిగణనలో తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం గుమ్మఘట్టలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా విత్తన వేరుశనగ పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి రైతుకూ సబ్సిడీతో విత్తన వేరుశనగ అందించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆలిండియా రేడియోలో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని రెండు రోజుల్లో ప్రవేశపెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మను ఆదేశించారు. ముందస్తుగా వర్షాలు కురుస్తున్న తరుణంలో రైతులు పొలాలను దుక్కిచేసుకోవాలని సూచించారు. సజ్జ, ఆముదం, ఉలవ, కొర్రలు, కందులు, పత్తి, పెసలు, అలసంద తదితర విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు కృషి చేయాలని పలువురు రైతులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓ సుస్మితరాణి, ఏడీఏ లక్ష్మానాయక్, ఏపీ సీడ్స్ మేనేజర్ సుబ్బయ్య, ఎంపీడీఓ గౌరీదేవి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఓ నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తన పంపిణీ ప్రారంభం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 40 శాతం రాయితీపై విత్తన వేరుశనగ కాయల పంపిణీ ప్రారంభమైంది. గుమ్మఘట్టలో కలెక్టర్ వినోద్‌కుమార్ లాంఛనంగా ప్రారంభించగా మిగతా ప్రాంతాల్లో ఏడీఏలు, ఏఓలు, ఏపీ సీడ్స్ అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ జరిగిందని జేడీఏ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. 388 ఆర్‌బీకేల పరిధిలో 76,710 క్వింటాళ్ల నాణ్యమైన విత్తన వేరుశనగ రైతులకు అందించనున్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి రైతుకూ విత్తనం అందిస్తామని తెలిపారు. ఒకవైపు విత్తన రిజిస్ట్రేషన్, మరోవైపు పంపిణీ కొనసాగిస్తామన్నారు. తొలిరోజు మధ్యాహ్నం తర్వాత పంపిణీ మొదలు పెట్టడంతో విత్తన పంపిణీ తక్కువగానే జరిగినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి



మృతి చెందిన భానుప్రియ

కూడేరు: మండలంలోని మరుట్ల–1వ కాలనీకి చెందిన కిష్టప్ప కుమార్తె భానుప్రియ(10) విద్యుదాఘాతంతో మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... గురువారం రాత్రి భానుప్రియ నీటిని వేడి చేసేందుకు హీటర్ స్విచ్ ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై సీఐ శివరాముడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి



జయరాములు (ఫైల్)

రాయదుర్గం టౌన్: పట్టణంలోని భంభం స్వామి లే అవుట్‌లో నివాసముంటున్న వద్ది జయరాములు(65) అనుమానస్పదస్థితిలో మృతి చెందాడు. పట్టణ శివారు బళ్లారి రోడ్డులో ఉన్న నగర వనంలో శుక్రవారం ఉదయం జయరాములు మృతదేహాన్ని అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు. మృతి చెంది నాలుగు రోజులైనట్లుగా తెలుస్తోంది. జయరాములుకు ఇద్దరు కుమారులున్నారు. గత ఆదివారం సాయంత్రం నుంచి తమ తండ్రి కనిపించడం లేదని అప్పట్లో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం నగర వనంలో జయరాములు మృతదేహం లభ్యం కావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు రోజుల క్రితం కనిపించకుండా పోయిన జయరాములు ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగుతోంది.

ఐరన్ మార్ట్‌లో చోరీ

గుత్తి: స్థానిక అనంతపురం రోడ్డులోని సబిహా స్టీల్ అండ్ ఐరన్ మార్ట్‌లో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి తర్వాత ఓ దొంగ మార్ట్ షట్టర్‌ను ఐరన్ రాడ్‌తో తెరచి లోపలకు ప్రవేశిస్తున్నట్లుగా సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమైంది. రెండు క్యాష్ బాక్స్‌ల్లోని సుమారు రూ. 33 వేలు నగదుతో పాటు ఓ సెల్‌ఫోన్‌ను అపహరించుకెళ్లాడు. ఘటనపై ఐరన్ మార్ట్ యజమాని కేఏస్ ఖాజా ఫిర్యాదు మేరకు సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ నబీరసూల్ షాప్‌ను పరిశీలించి, కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

ఎస్కేయూలో కొత్త ‘టెక్’ కోర్సులు

- బీటెక్‌లో సీఎస్ఈ డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
- ఎంటెక్‌లో స్ట్రక్చరల్, థర్మల్ కోర్సులు
- కంప్యూటర్ సైన్సెస్, ఈసీఈ బ్రాంచ్‌లో భారీగా సీట్ల పెంపు
- ఇండస్ట్రీ–4 టెక్నాలజీ విప్లవానికి అనుగుణంగా నూతన ప్రోగ్రామ్‌లు
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి



ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల

అనంతపురం: నాలుగో పారిశ్రామిక విప్లవం ప్రపంచ పారిశ్రామిక రూపురేఖలను శరవేగంగా మార్చి వేస్తోంది. ఇండస్ట్రీ–4 టెక్నాలజీ విప్లవంతో సరికొత్త ఉపాధి అవకాశాలు విస్తృతంగా దక్కుతున్నాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, వర్చువల్ రియాల్టీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఫుల్‌స్టాక్ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్... ఇలా అనేక నూతన సాంకేతికతలు అందుబాటులోకి రావడంతో పరిశ్రమల రూపురేఖలే మారిపోతున్నాయి. అయితే, ఈ తరహా సాంకేతికతను అందిపుచ్చుకున్న నిపుణులు అందుబాటులో లేకపోవడంతో ఆయా పరిశ్రమలు నిపుణుల కొరత ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఇండస్ట్రీ–4 టెక్నాలజీని ప్రవేశపెట్టడం అనివార్యమైంది. దీంతో భారీగా ఉద్యోగాలు దక్కనుండడంతో ఇంజినీరింగ్ కోర్సుల్లోనూ మార్పులు అనివార్యం అయ్యాయి. మారుతున్న కాలానుగుణంగా సాంకేతిక విద్యలోనూ మార్పులు తప్పనిసరి అయ్యాయి. అధునాతన ప్రపంచంలో ఎదురయ్యే పోటీని ఎదుర్కొని, ఉద్యోగావకాశాలు దక్కించుకునేలా విద్యార్థులను సంసిద్ధులను చేసే కార్యాచరణకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఎస్కేయూ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచే నూతన కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించనున్నారు.

నాలుగు అధునాతన ప్రోగ్రామ్‌లు

ఎస్కేయూలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటికే బీటెక్, ఎంటెక్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నారు. కొత్తగా బీటెక్ కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో సీఎస్ఈ డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ అందుబాటులోకి రానున్నాయి. అలాగే కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌లో ప్రస్తుతమున్న 60 సీట్లను 120కి పెంచారు. కొత్త కోర్సుల్లో ఒక్కో కోర్సుకు 60 చొప్పున సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌కు 120, రెండు కొత్త కంప్యూటర్ అదనపు బ్రాంచ్‌లకు 120 కలిపి మొత్తం 240 కంప్యూటర్ ఇంజినీరింగ్ సీట్లను ఈ విద్యా సంవత్సరంలో భర్తీ చేయనున్నారు. ఎంటెక్‌లో నూతనంగా సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో థర్మల్ ఇంజినీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టారు. బీటెక్‌లో సివిల్, మెకానికల్, సీఎస్ఈ, ఈఈఈ కోర్సులు ఉన్నాయి. ఎంటెక్‌లో ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబీడెడ్ సిస్టమ్, సివిల్, మెకానికల్ కోర్సులు ఉన్నాయి.

పరిశ్రమల యాజమాన్యాలతో ఒప్పందం

కోర్సుల్లోనే పరిశ్రమల అనుభవం గడించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. ఇందుకోసం పరిశ్రమల యాజమాన్యాలతో ఎస్కేయూ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. జెన్సార్, కేపీఐటీ, ఈఎంసీ, ఐబీఎం, పర్‌సిస్టెన్స్ కంపెనీలు ఈ కోవలో ఉన్నాయి. ఇందులో భాగంగానే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనింగ్, పరిశ్రమల సందర్శన, టెక్నికల్ కాంపిటీషన్స్, హైటెక్ లైవ్ ప్రాజెక్ట్స్, గెస్ట్ లెక్చరర్స్, స్పాన్సర్‌షిప్ ఆఫ్ టెక్నికల్ ఈవెంట్స్‌ను నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో కోర్సు పూర్తి చేసిన వారికి కొలువులు విస్తృతంగా దక్కేలా చర్యలు చేపట్టారు.

2023–24 విద్యా సంవత్సరంలో మొత్తం 105 మంది విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కొలువులు దక్కాయి. టీసీఎస్‌లో ఐదుగురు, ఇన్ఫోసిస్- 3, గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీ -20, క్యూ-స్పైడర్ - 35, పెంటగాన్ స్పేస్ -15, పలె టెక్నాలజీస్ -14, విప్రోలో 2, ఇంటలెక్ట్- 1, యాక్సెంచర్ - 3, ప్రొడప్ట్ టెక్నాలజీ-5, హెచ్‌సీఎల్‌లో ఇద్దరు చొప్పున ఎంపికయ్యారు.

కంపెనీ అవసరాలకు తగినట్లుగా...



కంపెనీల అవసరాలకు తగినట్లుగా విద్యార్థులను తర్ఫీదు చేస్తే ఉపాధి అవకాశాలు తప్పక దక్కుతాయి. దీంతో బీటెక్‌లో రెండు, ఎంటెక్‌లో రెండు కొత్త కోర్సులను ప్రవేశపెట్టాం. 2024–25 విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చాం. ఇంజినీరింగ్ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు, అధునాతన సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవడంతో అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి.

– డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి, వీసీ, ఎస్కేయూ

పోస్టల్ బ్యాలెట్లలో టపాకట్టేవి ఎన్ని?

- 2019 ఎన్నికల్లో పోలైన పోస్టల్ బ్యాలెట్లు 47 వేలు
- ఇందులో చెల్లని ఓట్లు 28 వేలు
- ప్రస్తుత ఎన్నికల్లో పోలైన పోస్టల్ బ్యాలెట్లు 20 వేలు




పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేస్తున్న సిబ్బంది (ఫైల్)

2019 ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌లు ఇలా	
పోస్టల్ బ్యాలెట్ తీసుకుంది	48,721
ఓటు హక్కు వినియోగించుకుంది	47,531
చెల్లని (ఇన్‌వ్యాలిడ్) ఓట్లు	28,452
చెల్లుబాటైన ఓట్లు	19,079

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవడం సర్వసాధారణం. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులకు సంబంధించి జిల్లావ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 24,454 ఉండగా 20,755 ఓట్లు పోలయ్యాయి. వీటిలో ఎన్ని చెల్లుబాటు అవుతాయనే దానిపై ఉద్యోగ వర్గాల్లోనే ఆసక్తికర చర్చ సాగుతోంది. ఇందుకు కారణమూ లేకపోలేదు. 2019 ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో 59.86 శాతం ఓట్లు చెల్లుబాటు కాలేదు. అప్పటి ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని 14 నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ విధులు నిర్వర్తించిన 48,721 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం–12 తీసుకున్నారు. ఇందులో 47,531 మంది ఉద్యోగులు (98 శాతం) పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తీరా ఓట్ల లెక్కింపులో 28,452 (59.86 శాతం) ఓట్లు చెల్లకుండా పోయాయి. ఇదే ఇప్పుడు ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది.

త్యాగానికి ప్రతిరూపం ‘కల్లూరు’

సందర్భం
నేడు కల్లూరు సుబ్బారావు జయంతి



అనంతపురం కల్చరల్: కొందరు పుట్టుకతోనే గొప్పవాళ్లుగా ఉంటారు. మరికొందరికి ఈ లోకం గొప్పతనాన్ని ఆపాదిస్తుంది. ఈ రెండో కోవలో చాలా కొద్ది మంది మాత్రమే తమదైన వ్యక్తిత్వంతో గొప్పవారవుతారు. ‘అనంత’ త్యాగధనుడు కల్లూరు సుబ్బారావు నిస్సందేహంగా ఈ కోవకు చెందిన వారే. స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించి 1928 నవంబర్‌లో నంద్యాలలో జరిగిన సభలో దత్త మండలాలకు రాయలసీమని పేరు పెట్టిన వారిలో కల్లూరు సుబ్బారావు ప్రముఖులు. నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, ఐదుకల్లు సదాశివన్ వంటి ఎందరో కల్లూరి సుబ్బారావు స్ఫూర్తితో ఆయన శిష్యులుగా జాతీయ స్థాయిలో రాణించారు. అనంత అభివృద్ధి కోసం పరితపించిన ఆయన 1937లో రాయలసీమ వారికి అన్యాయం జరగకుండా ‘శ్రీబాగ్ ఒడంబడిక’పై సంతకం చేశారు. స్వాతంత్ర్యానంతరం ఎంతో విలువైన తన సొంత స్థలాన్ని కళాకారుల కోసం (ప్రస్తుతం లలితకళాపరిషత్తు) విరాళంగా ఇచ్చేశారు. 1967లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. త్యాగానికి ప్రతిరూపంగా నిలచిన కల్లూరు సుబ్బారావు 1897, మే 25న హిందూపురం సమీపంలోని కల్లూరు గ్రామంలో జన్మించారు. 1973లో కన్నుమూశారు. ఆయన జయంతి సందర్భంగా ప్రతిష్టాత్మకంగా అందించే ‘కల్లూరు సుబ్బారావు అవార్డును’ ఈ ఏడాది సామాజిక సేవా కార్యకర్త తరిమెల అమరనాథరెడ్డికి అందజేయనున్నారు. కల్లూరు వారి ఆదర్శప్రాయ జీవితానికి మరింత ప్రాచుర్యం కల్పించేలా జయంతి, వర్ధంతులను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఎల్కేపీ అధ్యక్ష, కార్యదర్శులు గాజుల వెంకట సుబ్బయ్య, పద్మజ తెలిపారు.

సమాంతరంగా మానవత

రక్తదాతగా, సీనియర్ రచయితగా జిల్లాకు చిరపరిచితులైన తరిమెల అమరనాథరెడ్డి ఆదర్శప్రాయ సేవాతత్పరుడిగా పేరు గడించారు. దేవుడిపై నమ్మకం తప్పు కాదు కానీ భగవంతుని పేరుతో సాగే దోపిడీకి వ్యతిరేకంగా పలు ఉద్యమాలు చేపట్టారు. ‘మానవతా సంస్థ’ను ఏర్పాటు చేసి రక్తదానంపై ప్రజలను నిత్య చైతన్యం చేస్తున్నారు. స్వాతంత్ర సమరయోధుడు కల్లూరు సుబ్బారావు ఆదర్శ వ్యక్తిత్వం తనను కట్టిపడేసిందని చెప్పే ఆయన... కల్లూరు పురస్కారానికి తన ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఎల్‌కేపీలో పురస్కార ప్రదానం

అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో శనివారం సాయంత్రం కల్లూరు సుబ్బారావు జయంతిని ఘనంగా నిర్వహించనున్నారు. కల్లూరు సుబ్బారావు పేరిట పురస్కారాన్ని తరిమెల అమరనాథరెడ్డికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అందజేయనున్నారు. ఈ సందర్భంగా లలితకళాపరిషత్తు కళాకారులు ‘శ్రీకృష్ణ రాయబారం’ పౌరాణిక నాటకాన్ని సీనియర్ నటులు సోమిరెడ్డి, రామాంజనేయులు ప్రదర్శించనున్నారు.

ఇసుక దిబ్బలను సందర్శించిన జీఐజెడ్ బృందం



రైతులతో మాట్లాడుతున్న జీఐజెడ్ బృందం సభ్యులు

కణేకల్లు: మండలంలోని వేదవతి హగరి నదీ పరీవాహక ప్రాంతంలోని ఇసుక దిబ్బలను జెసెల్ షాఫ్ట్ ఫర్ ఇంటర్నేషనల్ జుసమ్మెనర్బీట్ (జీఐజెడ్) బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. కోకుర్తి, మాల్యం, నాగేపల్లి, తుంబిగనూరు, గరుడచేడు, మీనహళ్లి, బిదరకుంతం గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో పర్వతాలను తలపించేలా ఏర్పడిన ఇసుక దిబ్బలను చూడగానే జీఐజెడ్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ గోపీనాథ్, అసిస్టెంట్ టెక్నికల్ నిపుణుడు సంతోష్, ప్లానింగ్ నిపుణుడు ప్రసాద్ ఆశ్చర్యపోయారు. వారి వెంట రాయదుర్గం ఏపీడీ అసిస్టెంట్ దేవరాజు, ఏపీఓ సుధాకర్ ఉన్నారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమై రోజురోజుకూ విస్తరిస్తున్న ఇసుక మేటల వల్ల కలిగే పంట నష్టాలపై, పంటల సాగుకు తలెత్తుతున్న అవాంతరాలను అడిగి తెలుసుకున్నారు. ఆషాఢంలో వేగంగా వీచే గాలి వల్ల ఇసుక తెరలు తెరలుగా లేచి పక్క భూముల్లో పడుతుందని రైతులు తెలిపారు. వేరుశనగ విత్తు మొదలు మొలకెత్తే వరకూ తామెంతో ఆందోళనతో గడపాల్సి వస్తోందన్నారు. ఇదే ఇసుక నల్లరేగడి భూములు, చౌడు భూములకు తరలించి ఆ భూమిపై పరిచి పంటలు సాగు చేస్తే మేలైన దిగుబడులు వస్తున్నాయని రైతులు తెలిపారు. అవసరమైన రైతులకు ఈ ఇసుకను తరలించే ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇసుక తరలింపుతో పాటు పలుచోట్ల రేగు, సరుగుడు, గోరింటాకు తదితర చెట్లను పెంచడం వల్ల కూడా ఎడారి నివారణకు సత్ఫలితాలిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఎడారి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు జీఐజెడ్ బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బొమ్మనహాళ్ ఏపీఓ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు సోమన్నగౌడ్, హరి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి

- డీఆర్ఎంకు ఎంప్లాయీస్ సంఘ్ విన్నపం



మాట్లాడుతున్న ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

గుంతకల్లు: రైల్వేలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు న్యాయపరమైన పరిష్కారం చూపాలని డీఆర్ఎం వినీత్‌సింగ్‌కు దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్ శుక్రవారం ఎంప్లాయీస్ సంఘ్ నాయకులతో డీఆర్ఎం పీఎన్ఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ... మహిళ ఉద్యోగులకు అన్ని రైల్వేస్టేషన్లు, పని చేసే ప్రదేశాల్లో ప్రత్యేక రెస్ట్ రూమ్‌లు, గ్యాంగ్‌మెన్స్‌కు రెస్ట్ కం టూల్‌బాక్స్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. రన్నింగ్ స్టాఫ్‌కు రన్నింగ్ రూమ్‌ల్లో ప్రత్యేక గదులు నిర్మించాలని కోరారు. గుత్తి రైల్వే ఆస్పత్రిలో అంబులెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. లోకోపైలెట్ పని గంటలు తగ్గించడంతోపాటు ఎలాంటి జాప్యం లేకుండా ప్రమోషన్లు కల్పించాలన్నారు. రైల్వే క్వాటర్స్ చాలా అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయాలని సూచించారు. కొత్త క్వాటర్స్‌ను నిర్మించాలని కోరారు. సమస్యలపై డీఆర్ఎం వినీత్‌సింగ్ సానుకులంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంప్లాయీస్ సంఘ్ డివిజన్ అధ్యక్షుడు బాబు, నాయకులు మల్లికార్జున, కుళ్లాయప్ప, వెంకటేశ్వర్లు, సుభాష్‌బాబు, బాలకృష్ణ, అప్పారావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్స్య శాఖ ఉద్యోగి ఆత్మహత్య


గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్ల డ్యాంలో ఉన్న మత్స్యశాఖ కేంద్రంలో ఫిషర్ మ్యాన్‌గా పనిచేస్తున్న అల్లాబకాష్ (54) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు పెనకచెర్ల డ్యాం నివాసి అయిన అల్లాబకాష్ మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక శుక్రవారం ఆయన మృతి చెందారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

‘ఏపీ మోడల్’లో ఇంటర్ దరఖాస్తులకు ముగిసిన గడువు

- రాయదుర్గంలో అత్యధికంగా 272 దరఖాస్తులు

రాయదుర్గంటౌన్: జిల్లాలోని ఏపీ ఆదర్శ పాఠశాల(ఏపీ మోడల్ స్కూల్)ల్లో మొదటి సంవత్సరం ఇంటర్ ప్రవేశాలకు విశేష స్పందన లభించింది. ఇంటర్మీయట్‌లో వివిధ కోర్సుల ప్రవేశాలకు గురువారంతో గడువు ముగిసింది. జిల్లాలో మొత్తం 15 మోడల్ స్కూళ్లు ఉండగా ఆన్‌లైన్ ద్వారా మొత్తం 1,890 దరఖాస్తులు అందాయి. జిల్లాలో అత్యధికంగా రాయదుర్గం ఏపీ మోడల్ స్కూల్‌కు 272 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా తర్వాతి స్థానాల్లో గుత్తిలో 269, గార్లదిన్నెలో 210, పామిడిలో 208, కళ్యాణదుర్గంలో 196, తాడిపత్రిలో 163, రాప్తాడులో 149, పుట్లూరులో 148, ఉరవకొండలో 131, విడపనకల్లులో 89, కణేకల్లులో 78, శెట్టూరులో 70, వజ్రకరూరులో 62, యల్లనూరులో 59, యాడికి మోడల్ స్కూల్‌కు 58 మంది దరఖాస్తు చేసుకున్నారు. గడువు ముగియడంతో టెన్త్ ఫలితాల్లో మెరిట్ ప్రాతిపదికన అడ్మిషన్లు ప్రారంభించుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు రాయదుర్గం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. మోడల్ స్కూళ్లలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఆంగ్ల మాధ్యమంలో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సులో 40 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు.

పుస్తకాలందలేదనే ఫిర్యాదు రాకూడదు



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ వరలక్ష్మి

గుంతకల్లు: ప్రభుత్వం సరఫరా చేసే పాఠ్యపుస్తకాలు అందలేదనే ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని డీఈఓ వరలక్ష్మి సూచించారు. పట్టణంలోని డాక్టర్ సర్వేపల్లి రాధ కృష్ణన్ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను భద్రపరిచారు. శుక్రవారం డీఈఓ తనిఖీ చేశారు. పట్టణంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి? ఇండెంట్ ప్రకారం పాఠ్యపుస్తకాలు అందాయా? ఇంకా ఏమైనా పెండింగ్ ఉన్నాయా? అని ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడులను అడిగి తెలుసుకున్నారు. 1–7 విద్యార్థుల పుస్తకాలు తక్కువ వస్తే జిల్లా మేనేజర్‌కు, 8–10 పుస్తకాలు తక్కువస్తే విజయవాడకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికీ సకాలంలో పుస్తకాలు అందజేయాలన్నారు.

ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు పెరగాలి

కూడేరు: ప్రభుత్వ బడుల్లో ఎక్కువ మంది పిల్లలు చేరేలా చూడాలని డీఈఓ వరలక్ష్మి మండల విద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కూడేరు ఎమ్మార్సీని సందర్శించారు. ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన నోట్, పాఠ్యపుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని విద్యా సామగ్రిని భద్రంగా నిల్వ ఉంచి, బడులు తెరిచాక విద్యార్థులందరికీ పంపిణీ చేయాలని మండల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ బడుల్లో అందించే నాణ్యమైన విద్య గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 చంద్రశేఖర్, ఎంఈఓ–2 సాయికృష్ణ, సీఆర్పీలు రమణ, శివ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

నాలుగో రోజు కొనసాగిన సిట్ విచారణ

తాడిపత్రి అర్బన్: ఎన్నికల సమయంలో, ఆ తర్వాత తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్లపై సమగ్ర విచారణ చేసి ప్రాథమిక నివేదికను అందజేసిన సిట్ అధికారులు... మరింత లోతైన విచారణలో భాగంగా రెండో విడత తాడిపత్రికి విచ్చేశారు. ఇప్పటికే మూడు రోజులుగా విచారణ కొనసాగింది. నాలుగో రోజు శుక్రవారం కూడా విచారణను అధికారులు చేపట్టారు. మూడు రోజులుగా రూరల్ పోలీస్ స్టేషన్‌లో మకాం వేసిన సిట్ బృందం అల్లర్లకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను శుక్రవారం పరిశీలించింది. ఇప్పటి వరకూ నిందితుల్లో ఎవరెవరిని అదుపులోకి తీసుకున్నారు. ఎంత మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు అనే అంశాలపై పరిశీలిస్తోంది. అంతే కాక అల్లర్లకు ముందు టీడీపీ వర్గీయులు భారీ సంఖ్యలో జేసీ నివాసం వద్దకు ఎలా చేరుకున్నారు అనే విషయంపై సిట్ బృందం లోతుగా విచారణ చేపట్టింది. పక్కా పథకం ప్రకారమే ముందుగానే ఆందోళనకారులు పట్టణంలోకి చొరబడ్డారా? అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

బీటీ ప్రాజెక్ట్ ఆధునికీకరణకు చర్యలు

- కలెక్టర్ వినోద్‌కుమార్



బీటీప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుమ్మఘట్ట: భైరవానితిప్ప ప్రాజెక్ట్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని బీటీపీ గ్రామ సమీపంలో ఉన్న ప్రాజెక్ట్‌ను అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓ రాణిసుస్మితతో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు స్థితిగతులపై జలవనరుల శాఖ ఈఈ నారాయణస్వామి నాయక్‌తో ఆరా తీశారు. రెండు టీఎంసీల సామర్థ్యంగల ప్రాజెక్టుకు ఎగువన కర్ణాటక నుంచి వేదవతి హగరి ద్వారా వరద వచ్చి చేరుతుందని ఈఈ తెలిపారు. అయితే ప్రాజెక్ట్ ఎగువన అక్రమ కట్టడాలతో నీరు సక్రమంగా అందడం లేదని వివరించారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని రెండు మండలాల్లో కుడి, ఎడమ కాలువల ద్వారా 12 వేల ఎకరాలకు రొటేషన్ పద్ధతిలో సాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

అయితే కాలువల్లో పూడిక తీతలో నిర్లక్ష్యం వహించడంతో దిగువన ఉన్న ఆయకట్టుకు నీరు అందడం లేదని రైతులు వాపోయారు. రిజర్వాయర్‌కు తగినంత సిబ్బందిని నియమించి, ముందస్తుగా కాలువల పూడిక తీత పనులు చేపట్టాలని కోరారు. అనంతరం ఆయకట్టు కాలువలను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధి పథకం కింద కాలువల్లో పూడికతీత పనులు చేపడతామని రైతులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ మద్దిలేటి, జలవనరుల శాఖ డీఈ బలరాం, ఏఈలు సాయిరాం, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు ఇన్‌ఫెక్షన్

- కుట్లు వేసిన చోట చీము
- ప్రతి పది మందిలో ముగ్గురిది అదే పరిస్థితి
- ప్రస్తుతం జీజీహెచ్‌లో 15 మందికిపైగా బాధితులు



ఇన్‌ఫెక్షన్‌తో జీజీహెచ్ గైనిక్ విభాగంలో చికిత్స పొందుతున్న బాలింతలు

అనంతపురం మెడికల్: ఉమ్మడి జిల్లా ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న అనంతపురం సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో వైద్య సేవలు నానాటికీ నరకప్రాయమవుతున్నాయి. ఇక్కడ రోజు వారీ ఓపీ 2,500, ఐపీ 1,300 వరకు ఉంటోంది. నిర్వహణ లోపంతో సమస్యలు తలెత్తుతున్నాయి. మొన్నటికి మొన్న విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుని గంటల తరబడి వైద్య సేవలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. తాజాగా గైనిక్ వార్డులో ఇన్‌ఫెక్షన్ కారణంగా పలువురు బాలింతలు ఇబ్బందులు పడిన విషయం వెలుగుచూసింది. ఫలితంగా ప్రసవం జరిగిన తర్వాత రోజుల తరబడి ఆస్పత్రి అడ్మిషన్‌లోనే ఉంటున్నారు. ఈ క్రమంలోనే రెండోసారి సైతం బాలింతలకు కుట్లు వేయాల్సిన దారుణమైన పరిస్థితి నెలకొంది. ఆస్పత్రి ఉన్నతాధికారులు, గైనిక్ విభాగం వైద్యుల పర్యవేక్షణ.. సురక్షిత ప్రమాణాలు పాటించకపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ప్రస్తుతం ఆస్పత్రిలోని గైనిక్ విభాగంలో 15 మందికిపైగా బాలింతలు ఇన్‌ఫెక్షన్ సోకి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రిలో రోగులకందే సేవల్లో వైద్యుల బాధ్యతారాహిత్యంపై ఇప్పటికైనా కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ప్రతి పది మందిలో ముగ్గురు

సర్వజనాస్పత్రి ప్రసూతి విభాగంలో రోజూ 25 నుంచి 30 ప్రసవాలు జరుగుతాయి. ఇందులో 5 నుంచి 10 సిజేరియన్‌లు ఉంటున్నాయి. గత నెలన్నర రోజులుగా సిజేరియన్ కేసుల్లో ప్రతి పది మందిలో ముగ్గురికి ఇన్‌ఫెక్షన్ సోకినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. బాలింతలకు కుట్లు వేసిన ప్రాంతంలో చీము వస్తోంది. సురక్షిత ప్రమాణాలు పాటించకపోవడమే ఇన్‌ఫెక్షన్‌కు కారణంగా వైద్యులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

ఫ్యుమిగేషన్ చేయిస్తున్నాం

బాలింతలకు సిజేరియన్ చేసిన ఐదు రోజుల్లోపు పుండు(ఊండ్) మానాలి. అయితే ఇన్‌ఫెక్షన్ కారణంగా గాయం నయం కావడం లేదన్న మాట వాస్తవమే. దీనిపై మైక్రో బయాలజీ విభాగం సూచన మేరకు గైనిక్ విభాగంలోని ఓ వార్డును ఫ్యుమిగేషన్ చేయించాం. మరో వార్డును ఫ్యుమిగేషన్ చేయించి బాలింతలకు మెరుగైన సేవలందిస్తాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్

క్లుప్తంగా

నేడు అనంతకు పుష్పగిరి పీఠాధిపతి


జగద్గురు విద్యాశంకర భారతీ మహాస్వామి

అనంతపురం కల్చరల్: పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతీ మహాస్వామి రెండు రోజుల అనంత పర్యటనకు రానున్నారని మొదటి రోడ్డు శివాలయం అనువంశిక ధర్మకర్త హోసూరు రామసుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. హైందవ ధర్మప్రచారయాత్రలో భాగంగా మైసూరుకు వెళ్తూ మార్గమధ్యంలో ఈనెల 25న రాత్రికి శివాలయం చేరుకుని పీఠ పూజలు చేస్తారని పేర్కొన్నారు. 26న ఉదయం కాశీవిశ్వేశ్వరుడికి జరిగే విశేష పూజల్లో పాల్గొని భక్తులకు అనుగ్రహభాషణం చేస్తారని తెలిపారు. భక్తులు స్వామి దర్శనం, తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ప్రతి విద్యార్థికీ 'విద్యా కానుక' అందాలి

- జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు


పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు

ఆత్మకూరు: ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యాకానుక ద్వారా విద్యా సామగ్రి అందాలని జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఎన్ని పాఠశాలలు ఉన్నాయి? ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలతో పాటు, విద్యకు సంబంధించిన సామగ్రి తప్పకుండా అందించాలని ఆదేశించారు. అనంతరం పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కంది, పెసలు ఉచితంగా ఇవ్వాలి

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులకు అందిస్తున్న వేరుశనగ విత్తన కాయలను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది వర్షాలు లేక పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతులకు పూర్తిగా నష్టం వాటిల్లిందన్నారు. అంతేకాకుండా అలసంద, కంది, పెసలు రైతులకు ఉచితంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామయ్య, ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు కృష్ణవేణి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి


నరసింహులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రామగిరి(చెన్నేకొత్తపల్లి): రామగిరి మండలం నసన కోటకు చెందిన వీఆర్‌ఏ వెట్టి నరసింహులు (75) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సూచనలతో బాబురెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరసింహులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుమారుడు రామగిరి మండలం సొసైటీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ ఏర్పాటు

అనంతపురం కార్పొరేషన్: వాతావరణ శాఖ ముందస్తు సమాచారం మేరకు రానున్న మూడు, నాలుగు రోజుల్లో భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉన్నటువంటి ప్రజలు ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో భారీ వృక్షాల కింద ఉండొద్దన్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో బయటకు వెళ్లకూడదని తెలిపారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే సహాయక చర్యల నిమిత్తం హెల్ప్‌లైన్ నంబర్లు 08554-274765, 230234 ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు.

సజావుగా విత్తన వేరుశనగ పంపిణీ


ఆత్మకూరు: వేరుశనగ పంపిణీ చేస్తున్న ఏఓ సుచరిత


రాప్తాడు: గొందిరెడ్డిపల్లి ఆర్బీకే వద్ద వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న ఏఓ శేఖర్ రెడ్డి

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. మండల వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు వేరుశనగ అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి సుచరిత తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకు సబ్సిడీపై వేరుశనగ విత్తనం అందుతుందన్నారు. వేరుశనగ విత్తనకాయలు కావాల్సిన రైతులు తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

రైతులందరికీ విత్తన వేరుశనగ అందాలి

రాప్తాడు: ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగ నాణ్యతలో రాజీపడొద్దు. అర్హులైన ప్రతి రైతుకు విత్తన వేరుశనగ కాయలు అందించాలని ఏఓ శేఖర్ రెడ్డి సూచించారు. శుక్రవారం రైతులకు విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేశారు. గొందిరెడ్డిపల్లి రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న విత్తన పంపిణీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి రైతుకూ విత్తన వేరుశన కాయలు పంపిణీ చేయాలన్నారు. నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను రైతులకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నాణ్యత లేని వేరుశనగ కాయలు వస్తే వెనక్కు పంపాలని సూచించారు. మొదటి రోజు మండల వ్యాప్తంగా 573 మంది రైతులకు 515 క్వింటాళ్ల వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రంజిత, రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తన పంపిణీకి ఏర్పాట్లు

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసిందని వ్యవసాయాధికారులు తెలిపారు. 40 శాతం సబ్సిడీ ధరతో అందించే విత్తన కాయల కోసం స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో రైతులు ఇప్పటికే పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. కనగానపల్లి మండలంలో మొదట విడత కింద 1,500 క్వింటాళ్ల విత్తనాన్ని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఏఓ కృష్ణకుమారి తెలిపారు. రిజిస్ట్రేషన్లు పూర్తి కాగానే ఈ నెలాఖరులోగా విత్తన కాయల పంపిణీని ప్రారంభిస్తామన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నాణ్యమైన విత్తన కాయలు పంపిణీ చేయాలి

రాప్తాడు: రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతులకు పంపిణీ చేస్తున్న విత్తన వేరుశనగ కాయల ప్యాకెట్లను ఏపీ రైతు సంఘం నాయకులు, మండల కార్యదర్శి పోతులయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు ఇవ్వాలన్నారు. కందులు, పెసలు, అలసందలు, ఆముదం, జొన్న విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తున్న విత్తన కాయల్లో రాళ్లు, పుల్లలు ఎక్కువగా ఉండడంతో పాటు నాణ్యత లోపం తీవ్రంగా కనిపిస్తోందన్నారు. వెంటనే అధికారులు స్పందించి నాణ్యమైన విత్తన కాయలను పంపిణీ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సీతారాం, ఎంపీడీఓ గీతావాణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, లింగా రెడ్డి, రఘుపతి, జనర్ధాన, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.


సబ్సిడీ విత్తన కాయల కోసం ఆర్బీకేలో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రైతులు

హిమోఫీలియాను నియంత్రించవచ్చు

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు


మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: రక్తం గడ్డ కట్టడంలో సహాయపడే రక్తఫలకికల కారకాలు జన్యుపరంగా, అనువంశికంగా లోపించడంతో హిమోఫీలియా వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి ప్లేట్లెట్ల కారకాలను శరీరంలోకి పంపిస్తే వ్యాధిని నియంత్రిచ్చవచ్చని వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో అనంతపురం హిమోఫీలియా సొసైటీ కార్యదర్శి కృష్ణమూర్తి, రోచ్ కార్యదర్శి డాక్టర్ ఉపేంద్ర కుమార్‌ల ఆధ్వర్యంలో హిమోఫీలియాపై పీజీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ వ్యాధి పురుషుల్లో అధికంగా ఉంటుందన్నారు. ఈ వ్యాధిపై పీజీ విద్యార్థులకు అవగాహన ఉండాలని, భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తిన వారికి మెరుగైన వైద్యం అందించవచ్చన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్ హెమటాలజిస్టు డాక్టర్ విక్రమ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హిమోఫీలియా వ్యాధి లక్షణాలు, నివారణ, నిర్ధారణ పరీక్షల వివరాలను తెలియజేశారు. పురుషుల్లో ఉండే క్రోమోజోముల్లోని లోపాల కారణంగా ఈ వ్యాధి వస్తుందన్నారు. అందుకే ఎక్కువ మంది పురుషుల్లో ఈ వ్యాధిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. మహిళల్లో కూడా కొంత మందిలో వ్యాధి లక్షణాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతపురంలో సుమారు 190 మందికిపైగా హిమోఫీలియా వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు. రక్తస్రావంలో అదుపుదల లేకపోవడం, చిన్న గాయాలకు కూడా ఎక్కువ రక్తం కారడం, రక్తం గడ్డ కట్టకపోవడం, బాహ్య, అంతర్గత అవయవాల్లో కూడా రక్తస్రావం తరచుగా జరుగుతూ ఉంటే వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అకడమిక్ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ షంషాద్‌బేగం, టీబీ చెస్ట్ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ రామస్వామి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, విశ్రాంత సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగన్నాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు


చెన్నేకొత్తపల్లి: పాఠ్యపుస్తకాలను చూపుతున్న ఎంఈఓ-2 ప్రసన్నకుమార్ నాయుడు

చెన్నేకొత్తపల్లి: ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందజేసేందుకు అవసరమైన పాఠ్యపుస్తకాలు మండల కేంద్రానికి చేరుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి-2 ప్రసన్నకుమార్ నాయుడు శుక్రవారం తెలిపారు. ఒకటి నుంచి పది తరగతులకు సంబంధించి మండలానికి 45 వేల పాఠ్య పుస్తకాలు అవసరమన్నారు. ప్రస్తుతం ఒకటి నుంచి ఏడవ తరగతులకు సంబంధించి 7,815 పుస్తకాలు సరఫరా అయ్యాయని పేర్కొన్నారు. పుస్తకాలను ప్రాథమిక పాఠశాలలో భద్రపరచినట్లు వెల్లడించారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు విడతల వారిగా త్వరలో మండలానికి చేరుతాయన్నారు. అనంతరం ఎమ్మార్సీ సిబ్బందితో కలిసి పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, శివారెడ్డి, వెంకటేష్, శివయ్య, నరసింహులు, కేశవ, పవన్ కుమార్, రమేష్ నాయక్, పుష్పలత, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పీఐసీయూలో చిన్నారుల అవస్థలు


మంచాన్ని సరి చేసేందుకు ప్రయత్నిస్తున్న స్టాఫ్‌నర్సులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్న పిల్లల విభాగంలోని పీఐసీయూలో మంచాలు దెబ్బతిన్నాయి. చిన్నారులకు అందించే సేవల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో చిన్న పిల్లల వార్డు ఏర్పాటైనప్పుడు వేసిన మంచాలు రిపేరీకి వచ్చాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పసికందులు, చిన్నారులను పీఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి సేవలందిస్తారు. వాస్తవంగా గుండె, ఊపిరితిత్తులు తదితర సమస్యలున్న వారికి వెంటిలేటర్, తదితర పరికరాల ద్వారా సేవలందిస్తున్నారు. ఇటువంటి తరుణంలో ఐసీయూలోని మంచాల్లో ఉంచి అవసరమైనప్పుడు మంచాన్ని ఎత్తు పెంచుకునే సదుపాయం ఉండాలి. ఇప్పుడున్న మంచాలు ఆ స్థాయిలో లేవు. దీంతో చిన్నారులకు ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ సర్వజనాస్పత్రి పరిధిలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కొత్త ఐసీయూ మంచాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ మంచాలను జీజీహెచ్‌కు తరలిస్తే చిన్నారులకు మరింత మెరుగైన వైద్యం అందుతుందని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. మరి అధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాలి.

నాడు-నేడు పనుల్లో వేగం పెంచాలి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: నాడు-నేడు పనుల్లో వేగం పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి సూచించారు. శుక్రవారం మండల వ్యాప్తంగా జరుగుతున్న నాడు-నేడు పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాడు-నేడు నోడల్ సిబ్బందితో సమీక్షా సమాశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలల్లో పని చేస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది, ఎమ్మార్సీ సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. నాడు-నేడు పనుల పురోగతిపై ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్షించారు. పాఠశాలలు పునః ప్రారంభంలోపు పెండింగ్ లేకుండా పనులు పూర్తి చేయాలని డీఈఓ సూచించారు. వారం వారం పనుల పురోగతిని తమకు పంపాలని ఆదేశించారు. పనులకు సంబంధించి వాడే వస్తువులు, సిమెంట్, ఇసుక తదితర వస్తువులు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే సమయానికి పనులు పూర్తి చేస్తే విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరవుతారన్నారు. పనులు, బిల్లుల పెండింగ్ తదితర వాటిపై అధికారులతో చర్చించారు. ఎంఈఓ-2 ప్రసన్నకుమార్ నాయుడు, ఎమ్మార్సీ సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రిలో ఈదురు గాలులతో వర్షం


యల్లనూరు రోడ్డులో నేలకొరిగిన చెట్టు

తాడిపత్రి అర్బన్: ఉక్కపోతతో అల్లాడుతున్న జనం శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వర్షంతో సేదతీరారు. శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు చోట విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. కురిసింది చిన్నపాటి వర్షమే అయినా ఈదురు గాలులు కావడంతో యల్లనూరు రోడ్డులోని అనంత గ్రామీణ బ్యాంకు సమీపంలో భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కొనసాగుతున్న కవాతు


కవాతులో పాల్గొన్న కేంద్ర బలగాలు

అనంతపురం: కేంద్ర సాయుధ బలగాల ఆధ్వర్యంలో నగరంలో కవాతు కొనసాగుతోంది. వన్‌టౌన్, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రధాన రహదారులు, కూడళ్లతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించారు. ఏమైనా సమస్యలు ఉంటే ఆయా స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లకూడదని సూచించారు. జిల్లా కేంద్రంలోని నారాయణపురం, తపోవనం, సంగమేశ్వర సర్కిల్, బసవన్న కట్ట, పాతూరు, వేణుగోపాల్ నగర్, ఆర్టీసీ బస్టాండు ఏరియాలో కవాతు చేపట్టారు. కార్యక్రమంలో అనంతపురం వన్‌టౌన్ సీఐ వి.రెడ్డప్ప, నారాయణ రెడ్డి, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సీఐలు విజయ్ కుమార్, ప్రధాన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యల్లమ్మ తిరునాల


బోనాలు తీసుకెళుతున్న భక్తులు

ఎన్పీకుంట: మండల కేంద్రంలో నాలుగు రోజులుగా జరిగిన యల్లమ్మ అమ్మవారి తిరునాల శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొలకలపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని నల్లగంగమ్మ ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున భక్తులు అమ్మవారికి బోనాలు పట్టారు. డీజే పాటలతో, డప్పు, వాయిద్యాల మధ్య పెద్ద సంఖ్యలో మహిళలు ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు తీసుకొచ్చారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం అనంతరం బోనాలు సమర్పించి ప్రసాదంగా స్వీకరించారు.

కూలితే కాని స్పందించరా?


రాజు రోడ్డులోని మాసినేని గ్రాండ్ వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

విద్యుత్ అధికారుల బాధ్యతారాహిత్యానికి నిలువెత్తు సాక్ష్యం ఈ ఫోటో. నగరంలోని రాజు రోడ్డు మాసినేని గ్రాండ్ సమీపంలో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఏ క్షణాన కిందకు పడుతుందోనని స్థానికులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్లు చేసి విన్నవించినా.. ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు మేలుకుని చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

– సాక్షిఫొటోగ్రాఫర్, అనంతపురం:

27, 28న చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు

పెద్దపప్పూరు: మండలంలోని కుమ్మెత గ్రామంలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి బ్రహోత్సవాలు నిర్వహించనున్నారు. ఏటా వైశాఖ మాసంలో స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. 27న స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు, 28న చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన కమిటీ సభ్యులు తెలిపారు. స్వామిని దర్శించుకోవడానికి మైసూరు నుంచి భక్తులు తరలిరావడం విశేషం. ఎన్నికల సందర్భంగా తాడిపత్రిలో జరిగిన అల్లర్ల దృష్ట్యా ఎక్కువ ఆర్భాటం లేకుండా ఆనవాయితీగా కార్యక్రమం జరుపుకోవాలని పోలీసులు ఆంక్షలు విధించారు.

ఆలయ చరిత్ర..

పూర్వం శ్రీకృష్ణ దేవరాయల పరిపాలనలో జనమేజయుడు ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించినట్లు ఇక్కడ శిలాశాసనాలు చెబుతున్నాయి. ఒకప్పుడు కుమ్మెతాపుర పట్టణంగా పిలువబడే ఈ గ్రామంలో 101 శివలింగాలు ఉండేవని, కాలగర్భంలో కొన్ని కలిసిపోయాయని ప్రస్తుతం మూడు శివలింగాలున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గుప్తనిధుల కోసం కొందరు దుండగులు గతంలో పలుమార్లు ఆలయ సమీపంలో తవ్వకాలు చేపట్టారు. దీంతో పురావస్తుశాఖ అధికారులు, దేవదాయశాఖ సిబ్బంది ఈ ప్రాంతంలో ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదని ఆలయ ఆవరణలో బోర్డులను ఏర్పాటు చేశారు.

అల్లర్లను ప్రోత్సహిస్తే ఉపేక్షించం


గంగినేపల్లిలో సోదాలు చేస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెలువడిన తరువాత గ్రామాల్లో అల్లర్లను ప్రోత్సహించి, గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని గంగినేపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత నేరస్తులు, నేర చరిత్ర కలిగిన వారి ఇళ్లలో సోదాలు చేపట్టారు. పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులు, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ రోజు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని.. ఎక్కడా సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుమతి లేదని తెలిపారు. పోలీసుల హెచ్చరికను పాటించకుండా గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేని నాలుగు వాహనాలను సీజ్ చేశారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


ఐసీడీఎస్, ఆర్డీటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన బాలికలు

ఆత్మకూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీదేవి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బాల్య వివాహాలను ఆపుదాం, బాల్యాన్ని రక్షిద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తూ బాలికలతో ర్యాలీ చేపట్టారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాసిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు ఉన్నత చదువులు చదువుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వాలు కూడా మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తూ ప్రోత్సాహిస్తున్నాయని కొనియాడారు. బాల్య వివాహాలతో ఆడపిల్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. బాలికలు చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే ఐసీడీఎస్ సిబ్బందికి గాని, పోలీసులకు గాని, మహిళా పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాల్య వివాహాలు చేసిన వారు, వాటిని ప్రోత్సహించిన వారికి చట్టరీత్యా శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు అనురాధ పాల్గొన్నారు.

ఊరేగింపులు, ర్యాలీలు నిషిద్ధం


తూంచర్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

కనగానపల్లి: రాజకీయ వైషమ్యాలతో గ్రామాల్లో అనవసరంగా గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తూంచర్ల గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ సందర్భంగా పాటించాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎన్నికల కౌటింగ్ తర్వాత గ్రామాల్లో ఎవ్వరూ బాణాసంచా పేల్చటం, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించటం నిషేధమన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎక్కడా గుంపులుగా తిరగటం, సమావేశాలు పెట్టుకోవటం చేయరాదన్నారు. పోలీస్ నిబంధనలు అతిక్రమించి ఎవ్వరైనా ప్రవర్తిస్తే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.